# సమాజక్షేమంలోనే వ్యక్తి క్షేమం ఇమిడి యున్నది

**భక్తిరేవ పరమార్థదాయినీ భక్తిరేవ భవమోహనాశినీ**
**భక్తిరేవ పరవేదన ప్రదా భక్తిరేవ పరమోక్షకారిణీ**

ప్రేమస్వరూపులారా!

భక్తిచేతనే మానవుడు పరతత్త్వాన్ని పొందగలుగుతున్నాడు. భక్తిచేతనే జననమరణాలు, భవరోగమును నివారణ గావించగలుగుచున్నాడు. భక్తిచేతనే పరమాత్మ తత్త్వాన్ని గుర్తించటానికి ప్రయత్నిస్తున్నాడు. భక్తిచేతనే పరమపదము పొందుచున్నాడు. భక్తియే పరమసాధనగా భావించి, పరమగమ్యముగా విశ్వసించి, పరమ లక్ష్యముగా తలంచి అనాదికాలమునుండి భారతీయులు ఈ మార్గమును అవలంబిస్తూ వచ్చారు. 'భక్తి' అనేక అర్థములచేత ఊహింపబడుతూ ఉన్నది. భక్తి అనే పదము 'భజ్' అనే ధాతువునుండి ఉద్భవించినది. 'భజ్ సేవాయాం' అన్నాడు శంకరుడు. సేవకు 'భక్తి' అని పేరు. ఎవరి సర్వీసు, ఎట్టి సర్వీసు (భజ్ సేవాయాం అనగా)? భగవత్ తత్త్వమునకు నిర్వచనములు అనేకములుంటున్నవి. 'భగవత్సేవయే నిజమైన భక్తి' అని నిరూపిస్తూ వచ్చింది, భారతీయ పరమార్థతత్త్వము. వివేకచూడామణి మరొక రీతిలో బోధిస్తూ వచ్చింది. 'స్వస్వరూప సందర్శనమే భక్తి' అన్నది. ఇంక నారదుడు ఈ భక్తి ప్రభావమును అనంతమైన రీతిగా బోధిస్తూ 'పరమ ప్రేమయే భక్తి', అని నిర్వచించాడు. ఏకధారగా భగవన్నామమును ప్రేమను ఇమిడ్చి ఆ ప్రేమప్రవాహము భగవంతునివైపు మరల్చటమే భక్తి అన్నారు.

**భావములు మార్పు చెందవచ్చు, హృదయము మార్పు చెందదు**

ఈ ప్రేమ తత్త్వము దేహమును మరపించి మురిపించి మనస్సులో లీనముగావించి

srisathyasaivahanamrutam

తన్మయత్వముగావించును. ముఖ్యముగా భక్తి అనగా దేహమును మరపించి, మనసును తెరిపించి, హృదయాన్ని మురిపించి దివ్యత్వమును ప్రకటించిన ప్రేమతత్త్వము. ఇంక రామానుజులవారు భక్తి అనగా సంతతధారగా భగవన్నామమును ఉచ్చరించుతూ ఆ తత్వమునే నిజమైన భక్తిగా భావిస్తూ జగత్తునకు ప్రచారప్రబోధలు సల్పుతూ వచ్చాడు. ఇంగ్లీషులో రాధ అనే పదము 4 అక్షరములతో RADA కూడినది. R నుంచి ప్రారంభమైనప్పుడు రాధ అవుతుంది. A నుంచి ప్రారంభమైనప్పుడు ఆధార్ అవుతుంది. D నుంచి ప్రారంభమైనప్పుడు ధార్ అవుతుంది. తిరిగి A నుంచి ప్రారంభమైనప్పుడు ఆరాధన అవుతుంది. రాధకు ఆధారం ఆరాధన. ఇది రాధ అన్నారు. ఇక వల్లభాచార్యులు మరొకరీతిగా చెబుతూ వచ్చారు. వల్లభాచార్య తత్వములో ఒక tap ఉంటుంది. దానిని తిప్పినప్పుడు ఏకధారగా నీరు కారుతుంది. ఎప్పుడు? ఆ పైప్‌లో పూర్తిగా నీరుండినప్పుడే ఏకధారగా కారుతుంది. నీరు తక్కువగా ఉండినప్పుడు ఒక్కొక్క బిందువు పడుతుంది. అనగా హృదయములో పరిపూర్ణ ప్రేమనిండినప్పుడు ఏకధారగా భగవన్నామమును ఉచ్చరిస్తుంటాడు మానవుడు. దీనినే 'సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరిచింతనమ్' అన్నాడు, వల్లభాచార్యులు. ఇంక మధ్వాచార్యులు 'ప్రపంచములో అనేకమంది మిత్రులుంటారు. నేడు మిత్రుడు కావచ్చు రేపు శత్రువు కావచ్చు. ప్రాపంచిక సంబంధమైన మిత్రులందరు ఒకానొక సమయములో శత్రువులే అవుతారు. నిజమిత్రుడు ఒక్క భగవంతుడే! కనుక, భగవంతుని పరమ మిత్రునిగా విశ్వసించి ప్రేమ తత్త్వమును తన మిత్రునిపై ప్రకటింప చేయటమే భక్తి' అన్నారు. వేదము దీనికి అతీతమైన తత్త్వము బోధిస్తూ వచ్చింది. నిరంతరము వేదము రెండు పదములను జ్ఞప్తికి తెప్పిస్తూ వచ్చింది-నిత్యము మరియు స్వగతము. నిత్యమనగా భూతభవిష్యత్ వర్తమానములందు మార్పుచెందని తత్త్వము. దీనినే 'త్రికాలా భాద్యం సత్యం' అన్నారు. మార్పుచెందని తత్త్వమే నిత్యము. స్వగతమనగా ఏమిటి? తాను ఒక్కటే అయినప్పటికిని తన ప్రకాశము సర్వత్రా వ్యాపింపచేసే దివ్యశక్తి కలది. దీనికి చక్కని ఉదాహరణము. సూర్యుడు ఒక్కడే; తాను నిత్యుడు. తాను ఎప్పుడూ మారడు. కానీ సూర్యప్రకాశమును సర్వత్రా ప్రకాశింపచేస్తున్నాడు. నిత్యమనే తత్త్వము సూర్యుడు. సూర్యప్రకాశము సర్వత్రా వ్యాపింపచేసేది స్వగతము. స్వగతము, నిత్యము రెండింటికి

sri sathyasai vahamrutam

ఒక్కడే మూలకారణము. దీనినే స్వరూప, స్వభావములని నిరూపిస్తూ వచ్చింది, స్మృతి. ఒకటి స్వరూపము, రెండవది స్వభావము. ఈ సూర్యునకు రెండు స్వభావములుంటున్నాయి. ప్రకాశించటము ఒక స్వభావము. వేడినందించటము రెండవ స్వభావము. అదే విధముగా ఆత్మకు రెండు స్వభావములుంటున్నవి. ఒకటి ప్రకాశించటము, రెండవది ప్రకాశించినదానిని వ్యాప్తి గావించటము. మన ఇంటిలో దీపము పెట్టుకుంటున్నాము. దీపము ఒక్కటే! అది ఒకే స్థానమునందు వుంటున్నాది. కాని, దాని వెలుగు గదంతా ప్రాకుతుంది. అదే విధముగా స్వరూపము ఒక్కటే. అదే ఆత్మస్వరూపము. అదియే నిత్యసత్యమైనది. దీనినే స్మృతి 'సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ' అంది. ఈ జ్ఞాన ప్రభావము సర్వత్రా వ్యాపింపచేసేది, స్వభావము. ఈ స్వరూపమును అణుస్వరూపమని స్మృతి బోధిస్తూ వచ్చింది. అణువుగాని పదార్థము జగత్తులో కానరాదు. సర్వపదార్థములందు అణుస్వరూపమై ఉంటున్నది. కనుకనే భగవంతుడు సర్వవ్యాపకుడు అని బోధిస్తూ వచ్చింది. అణుస్వరూపుడైన భగవంతుడు ఘనముగా కనిపిస్తాడు. ఈ అణు స్వరూపమునకు 'ధర్మ' అని పేరు పెట్టారు. ఈ ధర్మ సమస్త పదార్థములందు వ్యాపించి ఉందిగానీ తనయందు ఒక్క పదార్థమునకు చోటు ఇవ్వటంలేదు. ఎట్టి పరిస్థితియందు తనయందు ఏ పదార్థమును చేర్చుకోదు. సర్వ పదార్థములందు తాను సమ్మిళితమై వుంటున్నది. ఇట్టి అణుస్వరూపమునకు 'ధర్మ' అని పేరు పెట్టారు. సర్వ పదార్థములందు వ్యాపించిన తత్వమునకు 'ధర్మ' అన్నారు. ప్రాకృతమైన ఈ జగత్తునకు సమస్త పదార్థములు అత్యవసరమే! రూపములు భిన్నముగా కనిపించినప్పటికిని అందలి దివ్యతత్త్వము ఒక్కటియే. అట్టి ఏకత్వాన్ని ప్రబోధించినదే ఈ ధర్మ. అనగా భిన్న స్వరూపములందు అభిన్నమై ఉండటం. ఇది ఒక వెండి టంబ్లరు. మనము దీనిని మార్చి కప్పుగా చేసుకోవచ్చు లేక ప్లేటుగా మార్చుకోవచ్చు లేక స్పూనుగా మార్చుకోవచ్చు. ఈ విధంగా రూపమును మార్చుకోటానికి ఎంతైనా అవకాశముంటున్నది. అయితే రూపములు మారుతున్నవిగానీ వెండి మాత్రము మారలేదు. ఎప్పటికి వెండిలాగే వుంటున్నాది. కనుక దివ్యరూపమును నిరూపించేది ధర్మ. అన్ని రూపములందు ఏకత్వమే ప్రకాశించేది, ధర్మ. దీనినే మూలాధార పదార్థము అని ప్రబోధిస్తూ వచ్చింది వేదము. ఈ మూలాధారము సర్వ ఆధారములకు

srisathyasaivachanamrutam

మూలాధారము. అట్టి 'ధర్మ'ను మనము ఈనాడు మర్చిపోతున్నాము. ధర్మ సర్వవ్యాపకమై సర్వరూపములందు సంచరించుచున్నదనే తత్త్వాన్ని యీనాడు మర్చిపోతున్నాము. సర్వత్రా ఉండిన దివ్యత్వము ప్రతి మానవునియందు 'ధర్మ' అనే అణుస్వరూపములో ఉండడంచేత మానవుడు ధర్మస్వరూపుడు. మానవుడు దేని నిమిత్తమై జన్మించాడు? ఈ శరీరము దేని నిమిత్తమై అందించాడు, భగవంతుడు? ధర్మము నాచరించే నిమిత్తమై వచ్చింది. కానీ ఈనాడు మనం వచ్చిన పనిని మరచిపోతున్నాం. చెప్పిన పనిని వదలిపెడుతున్నాము. కల్పితమైనవి కల్పించుకుంటున్నాము. దీనివలననే మన స్వరూపాన్ని మనం గుర్తించుకోలేకపోతున్నాము. భగవత్స్వరూపాన్ని నిరూపించే నిమిత్తమై పర్వదినములు ప్రారంభమయినాయి. ఈనాడు 'వైకుంఠ ఏకాదశి' అన్నారు. వైకుంఠమనగా ఏమిటి? 'భగవంతుని నివాసము, వైకుంఠము. భగవంతుని నివాసము, కైలాసము. భగవంతుని నివాసము స్వర్గము' అని అనేక విధములుగా చెప్తుంటారు. ఇవన్నీ కేవలము భ్రాంతులే! భగవంతుని స్వస్థానము ఏమిటి? 'మద్భక్తాః యత్ర గాయన్తి తత్ర తిష్ఠామి నారద'. నా నివాసము ఎక్కడ? భక్తునియొక్క హృదయమే. నీవు ఏమైనా లెటరు వ్రాస్తే డైరక్టుగా ఈ ఎడ్రస్సు వ్రాయి. 'మద్భక్తాః యత్ర గాయన్తి తత్ర తిష్ఠామి' అది ప్రతిష్ఠ అయిన స్థానము. హెడ్డాఫీసు ఎడ్రసు. ఈ కైలాసము, వైకుంఠము, స్వర్గము ఇవన్నీ బ్రాంచి ఆఫీసులు. ఇవన్నీ చేరుతాయో లేదో. ఓ కైలాసవాసీ అని ప్రార్థన చేస్తే ఆ లెటరు చేరుతుందో లేదో, కానీ హృదయవాసికి డైరక్టుగా చేరుతుంది. నిస్సందేహముగా చేరుతుంది. భగవంతుడున్నది హృదయమునందు. మార్పుచెందనిది హృదయము. హృదయము మార్పుచెందేదికాదు. మనిషి ఎంతైనా మార్పు చెందవచ్చు. మనసు ఎంతైనా మార్పు చెందవచ్చు. భావములెన్నైనా మార్పు చెందవచ్చు. కానీ హృదయము మాత్రము మార్పుచెందదు. అట్టి నిర్గుణ నిరంజన తత్త్వమే భగవంతుని నివాసము. అదే వైకుంఠము, కైలాసము.

**మానవుని మనస్సు మారటం లేదు**

ఏకాదశి అంటే ఏమిటి? ఎక్కడో ఒక ప్రదేశమందు, పవిత్రమైన స్థానమందు పవిత్రమైన కాలము అని భావించరాదు. ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు,

srisatyasaivachanamrutam

మనస్సు. అ పదకొండు తత్వములతో కూడినదే ఏకాదశరుద్ర స్వరూపమన్నారు. రుద్రులనగా ఎవరు? ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు, మనస్సు ఇవి చేరినప్పుడే ఏకాదశరుద్రుడై పోయినాడు. రుద్రుడనగా మానవునియందే నివసించి ఉన్నాడు. సమస్తమునకు మానవ దేహమే మూలకారణము. 'సర్వతః పాణిపాదం....' అన్నింటికి మానవదేహమే మూలకారణము. ఇంత శక్తివంతమైన మానవత్వాన్ని ఈనాడు విస్మరిస్తున్నారు. సాక్షాత్ భగవన్నివాసమైన హృదయాన్ని మర్చిపోతున్నారు. మృదుమధురమైన తత్వము కలిగిన ఈ హృదయమును కాఠిన్యమనేది కాటువేస్తున్నది. సర్వము మారుతున్నది గానీ మానవుని మనస్సు మారటంలేదు.

**మన నిర్మల నిస్వార్థప్రేమతత్త్వమును భగవంతునివైపు మరల్చాలి**

ఈనాడు నూతన సంవత్సర ప్రారంభము. ఇప్పటికి ఎన్నో పాత సంవత్సరములు కదలిపోయాయి. ఎన్నో కొత్త సంవత్సరములకు స్వాగతమిస్తున్నాము. ఈ విధంగా ఎన్ని పోతే మనకు వచ్చిన ఫలితమేమి? ఎన్ని వస్తే మనకు వచ్చిన ఫలితమేమి? ఏమిటి ఈ సంవత్సరమంటే? భగవంతునికి 'సంవత్సరాయ నమః' అని పేరు. కాలస్వరూపుడు భగవంతుడు. ఈ కాలస్వరూపుడే సంవత్సర స్వరూపుడుగా రూపొందాడు. 60 సెకండ్లు అయినప్పుడు నిముషమైంది. 60 నిముషములైనప్పుడు గంట అయింది. 24 గంటలైనప్పుడు దినమైంది. 30 దినములైనప్పుడు నెలయింది. 12 నెలలైనప్పుడు సంవత్సరమైంది. ప్రతిక్షణము నూతనమైన క్షణము. అలాంటి నిత్య నూతనమైన భగవంతుని దర్శించుకోవటానికి ఒక సంవత్సరమువరకు కాచుకోవలసిన అవసరము ఏమిటి? ఇది New year కాదు, ఇది పాతదే! నీవుకూడా కొత్తవాడవు కాదు, పాతవాడవే! ఇతనికి 'మానవ' అని పేరు పెట్టారు. 'మా' అనగా కాదు. 'నవ' అనగా కొత్త. నీవు పాతవాడే, సంవత్సరము పాతదే. ఎన్ని జరిగి పోయాయో ఎన్ని జరుగుతాయో! మనము భౌతిక దృష్టితో ఈ 'కొత్త సంవత్సరమని', 'ముక్కోటి ఏకాదశి' అని భావించుకుంటూ భ్రమించుకుంటూ ఉంటున్నాము. ఈ భ్రమలుండినంతవరకు బ్రహ్మ మనకు చిక్కడు. ఈ శరీరమనో ఇంద్రియవాక్కాయ తత్వములు ఏనాడు మర్చిపోదుమో అప్పుడే మనకు బ్రహ్మ తత్త్వము



srisathyasaivachanamrutam

ప్రాప్తిస్తుంది. ఇది దేహము, ఇది మనస్సు, ఇది ఇంద్రియము ఈ విధమైన దృష్టిలో ఉండినంతవరకు బ్రహ్మ తత్వము అర్థము కాదు. ఏది నీవు చింతిస్తున్నావో దానిగా నీవు మారిపోవాలి. దానినే 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' అన్నారు. దేనిని నీవు చింతిస్తున్నావో ఆ రూపముగా నీవు మారిపోవాలి. అదియే నిజమైన సాధన. భక్తి అనగా కేవలము అర్చన చేయటము, పూజలు చేయటము, వ్రతములు చేయటము కాదు. నీ నిజతత్వాన్ని నీవు గుర్తించటానికి ప్రయత్నించు. నీలో ఆవిర్భవించిన ప్రేమతత్త్వాన్ని పరమాత్మవైపు మరల్చు. ఈ ప్రేమ ఆవిర్భవించినది నీ నిమిత్తముకాదు. నీ దేహము ఒక పనిముట్టు. పనిముట్టుతో ప్రారంభమైంది, పనిముట్టుకు ఎందుకు లభ్యమవుతుంది. ఇది ఎవరికి అర్పితమో వారికే అర్పితము చేయాలి. మన నిర్మలమైన, నిస్వార్థమైన ప్రేమతత్త్వాన్ని భగవంతునివైపు మరల్చాలి. ఇదియే భక్తియొక్క ప్రమాణము. ఇదే భక్తియొక్క స్వరూపము. ఇట్టి పవిత్రమైన భక్తితత్త్వాన్ని ఈనాడు అనేక రకములుగా వికారపరుస్తున్నారు. 'ధర్మ' అనే తత్త్వము మనం చక్కగా గుర్తించాలి. ఈ ధర్మ అనేది అణుస్వరూపము. ఈ దేహమును ధరించినది కాబట్టి ధర్మస్వరూపమైనది, దేహము. అయితే ఈ దేహములో 3 రకములైన అంశములుంటున్నాయి. వీటినే త్రికరణములన్నారు. మనస్సు, వాక్కు, హస్తము. ఈ మూడింటిని మనము పరిశుద్ధము చేసినప్పుడు పవిత్రమైన మానవులుగా రూపొందుతాము.

**ఆధ్యాత్మికము ఉండినప్పుడే చిత్తశుద్ధి కలుగుతుంది**

ఎట్టి మానవునికైనా ఆధ్యాత్మికము అవసరమే! నాస్తికుడుగానీ, యాస్తికుడుగానీ, ఆస్తికనాస్తికుడుగానీ, భోగికానీ, యోగికానీ, జోగికానీ, బైరాగికానీ అందరికి భక్తి అత్యవసరమే! వారికి అర్థము తెలియక తాను 'భక్తుడు' కాదు అనుకుంటున్నాడుగానీ ఇది కేవలము భ్రమ. ఆధ్యాత్మికము వుండినప్పుడే మనకు చిత్తశుద్ధి కలుగుతుంది. ఆ చిత్తశుద్ధియే మొదటి కరణము. పవిత్రమవుతుంది. దీనికి ఆధ్యాత్మికము అత్యవసరము. రెండవది నైతికము. నైతికము వాక్శుద్ధి చేస్తున్నది. వాక్శుద్ధి గావించుటకు నైతికము చాలా అవసరము. ఇంక మూడవది ధార్మికము. హస్తముతో దానము చేస్తే హస్తము

sri sathyasai vahini

పవిత్రమవుతుంది. ఈ మూడు కరణములు పరిశుద్ధము కావటానికి ఆధ్యాత్మికము, నైతికము, ధార్మికము కావాలి. అప్పుడే త్రికరణశుద్ధి ఏర్పడుతుంది. ఆ త్రికరణశుద్ధి పొందగలిగినవాడే దైవత్వమును పొందగలుగుతాడు. ఈ కరణములలో ఏ కరణము కొంచెం మాలిన్యమైనప్పటికిని దైవత్వమును ఏనాటికి పొందలేడు. పాత్రలోని నీరు కారిపోవాలంటే పది చిల్లులు ఉండనక్కరలేదు, ఒక చిల్లు ఉంటే చాలు. పిల్లలు చదువుతున్నారు. అన్ని **subjects** లో మంచి మార్కులే వచ్చాయి. ఒక్క **subject**లో తక్కువ మార్కులొస్తే నీవు **fail** అయిపోయినట్లే! అదే విధముగా ఈ త్రికరణములలోపల ఏ కరణము కొంచెం అశుద్ధముగా ఉండినప్పటికిని అన్నింటిలో అశుద్ధము ఏర్పడుతుంది. కనుక ప్రతి మానవుడు త్రికరణశుద్ధి నిమిత్తమై ఆధ్యాత్మికము, నైతికము, ధార్మికము అనే ఈ మూడింటిని పెంచుకోవాలి. లేకుండిన, మానవునికి పశువుకు ఏమాత్రము వ్యత్యాసము లేదు. ఇది ద్విపాద పశువు, అది చతుష్పాద పశువు. కనుక పశువుకు, మనకు ఏమాత్రము భేదము లేకుండా ఉంటుంది. నీవు మానవుడు అనే తత్త్వాన్ని గుర్తించి సార్థకము గావించుకోవలెనన్న ఆధ్యాత్మికము, నైతికము, ధార్మికములను అలవర్చుకోవాలి. 'జంతూనాం నరజన్మ దుర్లభం' ఎంత పవిత్రమైనది నరజన్మము. ఇలాంటి నరజన్మమును కేవలము రాక్షసజన్మముగా మార్చుకుంటున్నారు. వానరుడుకూడా హాస్యముగావిస్తున్నాడు, 'ఓ పిచ్చివాడా! నీవు మానవుడై పుట్టి మాధవుని మరచిపోతున్నావే! నేను వానరుడై పుట్టి రామచింతన చేస్తున్నాను. రామకార్యములో పాల్గొంటున్నాను. నా రోమరోమము రామనామముతోనే నిండి ఉంటున్నాది. నీకంటె నేనే మేలు'. ఈనాడు మానవుడు ఇన్ని చదువులు చదివి ఇన్ని తెలివితేటలను పెంచుకొని ఇంత గొప్ప పేరు సాధించుకొని కట్టకడపటికి ఏమి సాధిస్తున్నాడు? ఏమీ సాధించటంలేదు. జీవితమంతా అశాంతి. పశుపక్షిమృగాదులన్నీ శాంతిని పొందుతున్నాయి. కానీ మానవునికి శాంతి చాలా దూరముగా ఉంటున్నాది. కారణం ఏమిటి? మితిమీరిన కోరికలతో మతి చెరుపుకుంటున్నాడు. ఒక్క కోరికయే మనకుండవలసినది. ఆ దైవకోరిక వుంటే సర్వకోరికలు నెరవేరుతాయి. చేతిలో మనకు బంగారముంటే ఎన్ని నగలైనా చేయించుకోవచ్చు. ఈనాడు బంగారమును మరచిపోతున్నాడు. నగలను ఆశిస్తున్నాడు.

sri sathyasai vachanamrutam

నగలు కేవలము ఆకారమునకేగాని అందులోకూడా బంగారమే ఉన్నది. దివ్యత్వము సర్వత్రా వ్యాపించి ఉంటున్నాది. అణుస్వరూపమై ఉంటున్నాది. కనుకనే శ్రుతులు 'అణోరణీయాన్ మహతో మహీయాన్' భగవంతుడు అణువులో అణువుగాను, ఘనంలో ఘనముగాను వున్నాడు అని ఘోషిస్తున్నాడు. భగవంతుని గుర్తించటానికి ఎవరికి సాధ్యముకాదు. ఈ అణుతత్త్వమును మనం విచారించాలి. ఈ అణువును సైంటిస్టులుకూడా గుర్తిస్తూ వచ్చారు. అణువులేని పదార్థము లేనేలేదు. సర్వత్రా అణువు వుంటున్నాది. ప్రపంచమంతా అణుమయమే! అలాంటి అణుతత్త్వమును గుర్తించుకుంటే ఇంక దైవత్వమును గుర్తించనక్కరలేదు. ఆనాటి పరమపవిత్రమైన హృదయము కలిగిన గోపికలందరూ

**నిను కనుగొనగలమా కృష్ణా! నిను కనుగొనగలమా!**
**అణువుకంటె అతి సూక్ష్మరూపుడవు**
**ఘనముకంటె అతి గణనీయుడవు**
**ఎనుబదినాలుగు లక్ష జీవముల**
**అనయమ్మును నెడబాయకుందువట**
**అణురేణువు తృణకాష్ఠము మొదలుగ**
**అఖండ రూపుడవై వెలయుదువట ॥నిను॥**
**ఘనమగు దొంగలలో గజదొంగవు**
**నిను కనుగొనగలమా కృష్ణా!**

అని శ్లాఘించారు. 84 లక్షల జీవరాశులందు అణుస్వరూపుడై ధర్మ అనే పేరుతో ప్రచారము పొందుతున్నాడు. భగవంతుడు లేని ప్రదేశము లేదు. ఇది భగవంతుడుకాదు అని చెప్పడానికి అవకాశమేలేదు. అలా చెప్పడం కేవలము తన భ్రమయే గానీ నిజమైన వాక్కుకాదు. సర్వత్ర వుండినది భగవంతుడే తప్ప అన్యములేదు. అట్టి విశ్వాసముతో ఈనాడు మానవుడు సత్కార్యములో పాల్గొని సదాచారములోపల జీవితమును అంకితము గావించాలి. సంకల్పములు పవిత్రమైనవిగా ఉండాలి. వాక్కులు సరైన వాక్కులుగా

నిరూపించాలి. సత్యవాక్కులుగా నిరూపించాలి. చేయు కర్మలు సరైన ఉపకార కర్మలుగా చేయాలి.

**దైవమును చింతించు; నీవే దైవమని భావించు**

ఏవి ఆభరణములు? 'సత్యం కంఠస్య భూషణం, హస్తం దానంచ భూషణం, శ్రోత్రంచ భూషణం శాస్త్రం' అన్నారు. సత్య వాక్కులుచ్చరించటమే కంఠమునకు ఆభరణము, దానధర్మములు చేయటమే హస్తమునకు ఆభరణము, చెవులకు మంచి విషయములు వినటమే ఆభరణములు. ఈ మూడింటిని సార్థకము గావించుకున్నప్పుడే మనము మానవులం. ఇలాంటి మానవత్వమును అర్థము చేసుకోలేక సంకుచితభావములచేత మానవుడు తన జీవితాన్ని వ్యర్థము గావించుకుంటున్నాడు. కనుక, సంకుచితభావములు మనలో ఆవిర్భవించరాదు. విశాలమైన భావములు రావాలి. నిర్మలమైన ప్రేమ తత్త్వమును మనం అభివృద్ధి పరచుకోవాలి. ఈ ప్రేమకంటె మించినది మరొకటి లేదు. కనుకనే Love is GOD. Live in LOVE. ఈ ప్రేమకంటె మించిన మరొక దేవుడు లేదు. కానీ ఆ ప్రేమతత్త్వాన్ని మనం వివిధ రూపములలోపల వివిధ మార్గములలో వ్యర్థము గావించుకుంటున్నాము. ఈ దేహము మట్టి పాత్ర. మట్టిపాత్రలో అమృతము నింపబడింది. కానీ ప్రకృతి అనే బంగారు పాత్రనిండా విషమే వుంటున్నది. బంగారమును చూస్తావా, విషమును చూస్తావా? బంగారమని భ్రమించి విషమును త్రాగుతున్నావు. దేహము మట్టిపాత్ర అయినా దీనిలో అమృతముంది కనుక 'మృణ్మయమే చిన్మయము' అన్నారు. ఇది కేవలము మట్టిపాత్రకాదు. మనము ఈ భ్రమలచేత సత్యాన్ని అసత్యముగాను, అసత్యమును సత్యముగాను విశ్వసిస్తున్నాము.

**దేవుడనగ వేరు దేశమున లేదు**
**దేవుడుండు తనదు దేహమందె**
**పాపమనగ వేరు పరదేశమున లేదు**
**తానుచేయు పనుల తగిలియుండు**

మనము చేసే పనులయందే ఉంటున్నాయి పాపపుణ్యములు. దేవుడు, దయ్యము మన



srisathyasaivachanamrutam

దేహమందే నివాసమై ఉంటున్నాయి. దైవాన్ని చింతిస్తివా దెయ్యము పారిపోతుంది. కనుక దైవమును చింతించు. నీవే దైవమని భావించు. భక్తి, విశ్వాసములు నిలుపుకో? అప్పుడే సార్థకమైన జీవిగా తయారౌతావు. ఎప్పుడు చూచినా మనసు అటూఇటూ తిరగటం, ఇది మానవుని స్వభావముకాదు. ఇది monkey mind. ఎలాంటి monkey? Mad monkey. The body is like a water bubble, mind is like a mad monkey; don't follow the body, don't follow the mind, follow the conscience. అదే నీ హృదయము. దానిని పరిశుద్ధము చేసుకో! లౌకికమైన జీవితాన్ని గడుపుకొంటూ అలౌకికమైన దివ్యత్వమును పొందాలంటే ఎలా సాధ్యమవుతుంది? ధర్మిభూతిజ్ఞానమని ఒకటి, ధర్మభూతిజ్ఞానమని రెండవది. ధర్మిభూతి జ్ఞానము రూపము. ధర్మభూతజ్ఞానము నామము. ఈ రూపనామములు రెండింటికి ఏ విధమైన భేదములేదు. ఈ భేదములేని తత్త్వమును మనము ఈనాడు గుర్తించాలి. అది ఏమిటి? అదియే హృదయము. దేహమునకు రూపముంది. సర్వజీవులందు ప్రకాశించే జ్ఞానతత్త్వము ఈయొక్క స్వరూపము. జ్ఞానహృదయమే దీనియొక్క స్వభావము. స్వరూపస్వభావముల రెండింటి ఏకత్వమే మనము ఈనాడు గుర్తించాలి.

### ప్రతి మానవుడు దైవస్వరూపుడే

ఈనాడు కొత్త సంవత్సరము, ముక్కోటి ఏకాదశి అన్నారు. ఏమిటి, ఎన్నాళ్లైనా ముక్కోటి ఏకాదశియేనా నాలుగుకోట్లు రాలేదా? ఇంతేకాదు వేదములందు కొన్ని కొన్ని మంత్రములుంటున్నాయి. 'సహస్రశీర్షాపురుషః సహస్రాక్ష సహస్రపాత్' భగవంతుడు సహస్ర శిరస్సులతో ఉన్నాడట, సహస్ర నేత్రములతో ఉన్నాడట, సహస్ర పాదములతో ఉన్నాడట! వేద కాలములో మానవులు వేలకు మాత్రమే పరిమితమై ఉన్నారు. ఇప్పుడు కోట్లకు మించిపోయినారు. వేదకాలములో వేలకు మాత్రమే పరిమితమైనవారు కనుక ప్రతి మానవుడు దైవస్వరూపుడే అన్నారు. ఇక ముక్కోటి దేవతలు. ముక్కోటి దేవతలు అనేటప్పుడు భారతదేశములో జనాభా మూడుకోట్లు మాత్రమే. ఆనాడు వేద పారాయణ, ఏకాదశి వ్రతములు చేసే సమయములో మూడుకోట్లుమంది మాత్రమే ఉంటున్నారు. భారతదేశములో ఈనాడు నూరుకోట్లు అయింది. జనాభా పెరిగిపోతున్నది గానీ

sri sathyasai vachanamrutam

మంత్రములో మాత్రము సంఖ్య పెరగలేదు. ఆనాడు చెప్పిన ముక్కోటి ఏకాదశిలో మూడుకోట్లమందికూడా దేవతలే! ప్రతి మానవుడు దైవస్వరూపుడే! పవిత్రమైన విశాలభావముతో ఆనాడు మంత్రమును ఉచ్ఛరిస్తూవచ్చారు. దానినే ఈనాడు అజ్ఞానముతో ఆచరిస్తున్నారు. కాదు, కాదు. గుర్తించవలసినది ఒక్కటే! ప్రతి మానవుడు దైవస్వరూపుడే. అందరియందు ఉన్న హృదయము ఒక్కటే! ఈ హృదయమే హృత్+దయ=పవిత్రమైన దయ. ఇంగ్లీషులో మానవులనందరిని mankind అంటారు. Mankind అంటే kindness తోకూడినవాడే man. ఈనాడు మానవునియందు kindness లేదు. కాబట్టి mankind అనకూడదు. ప్రతిదానికి అంతరార్థాలుంటున్నాయి. మనము అంతరార్థము తీసుకోవాలిగానీ బాహ్యార్థమునుకాదు. ఈ మైకు ఇక్కడ నిలచిందంటే దీనికి ఆధారము, టేబుల్. ఈ టేబుల్‌కు ఆధారము భూమి. ఒకదానికి ఆధారము, ఒకటి ఆధేయము. ఈనాడు ఆధారము మరచి ఆధేయాన్ని అనుసరిస్తున్నాము.

**దైవబలముముందు ఇతర బలములు పని చేయవు**

ప్రేమస్వరూపులారా! ప్రతి సంవత్సరము కొత్త సంవత్సరము వస్తున్నది, పాత సంవత్సరము పోతున్నాది. కానీ మనలో కొత్త భావాలు, పవిత్ర భావాలు రావటం లేదు. ఈ పాత భావాలు, రోత భావాలు పోవటం లేదు. ఈ రోత భావాలు పాత భావాలు బయటకు పంపాలి. నూతనమైన, ఉత్తేజమైన, దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన భావాలు హృదయములో చేర్చుకోవాలి. ఈనాడు పవిత్రత ఏమీ పెంచుకోటం లేదు. ఇలాంటి సంవత్సరములు ఎన్ని జరిగితే వచ్చిన ఫలితము ఏమిటి? Time waste is life waste. Time is GOD. Don't waste time. ఈ పవిత్రమైన కాలమును, పనికిరాని మాటలతో మన వాక్కును అశుద్ధపరచుకోకూడదు. పరదూషణచేత మన వాక్కు అపవిత్రము గావించకూడదు. శ్రవణముచేత అపవిత్రము చేసుకోకూడదు. మనము పవిత్రమైన ఇంద్రియాలతో అన్నింటిని అనుభవించాలి. దీనిని పురస్కరించుకొనే

**See no evil, see what is good,**
**Talk no evil, talk what is good**
**Hear no evil, hear what is good**

sri sathyasai vahini

**Think no evil, think what is good**
**Do no evil, do what is good**
**This is the way to GOD.**

ఇది మన పంచేంద్రియముల పవిత్రత. ఈనాటి మానవుడు ఎన్ని విద్యలు నేర్చినప్పటికిని దుర్గుణములు అతనినుంచి వీడిపోవటంలేదు. మనము దుర్గుణములను దూరము చేసుకోవాలి. మనము దుర్గుణాలను ఏనాడు దూరము చేసుకుంటామో ఆనాడే సద్గుణములు ప్రారంభమవుతాయి. మనము మానవులమని మర్చిపోకూడదు. మానవత్వము చాలా పవిత్రమైనది. ఇలాంటి పవిత్రమైన, ప్రియమైన, విలువైన మానవత్వాన్ని వ్యర్థము చేసుకోకూడదు. మానవతా విలువలు మనం పెంచుకోవాలి. దయ, ప్రేమ, సహనము, సానుభూతి ఇలాంటి పవిత్రగుణములను మనము అభివృద్ధి గావించుకోవాలి. మనలో ఆవిర్భవించే చెడ్డగుణములు దూరము చేసుకుంటూ పోవాలి. నేను అప్పుడప్పుడు మా పిల్లలకు చెబుతుంటాను. ఈ వయస్సులో చాలా monkey thoughts అభివృద్ధి అవుతుంటాయి. ఒక విధమైన confusion కూడా వస్తుంది. అనేక సంకుచిత భావాలు అభివృద్ధి అవుతుంటాయి. అప్పుడు ఒక chair లో కూర్చుని 'I am not monkey, I am man;' అని పది పర్యాయములు చింతించు. ఆ thoughts వెళ్లిపోతాయి. అట్లు పది నిమిషములు ఉంటే monkey thoughts కి అవకాశమే ఉండదు. Self punishment కి readyగా ఉంటుండాది. ఎవరో నీకు చెప్పకూడదు. అలాంటి అవకాశము నీవు అందించకూడదు. ఎవరితోనో చెప్పించుకునేవాడు slave అవుతాడు గానీ Master కాడు. నీవు Master కావాలి. కోపం వస్తుంది, ఉద్రేకం వస్తుంది. ఆ సమయములోకూడా ఒక ప్రదేశములో కూర్చుని I am not dog, I am man అని స్మరించు, తప్పక ఈ దుర్గుణములు పోతాయి. ఈ విధమైన సులభమార్గములో ఎంతో అభివృద్ధిగాంచవచ్చు. ఎలాంటి ఉన్నత స్థానమునైనా పొందవచ్చు. గొప్ప యజ్ఞములు, యాగములు, తపస్సులు చేయనక్కరలేదు. చిన్న విషయములోనే పెద్ద ఫలితమును సాధించవచ్చు. మీరు చూచి ఉంటారు. ఏనుగు చాలా బలమైనది. అది తొండంతో కొడితే మనిషి 90 అడుగుల దూరానికి పడతాడు. కాని, అంకుశము చూపిస్తే ఏనుగు అణిగిమణిగి ఉంటుంది. దాని

srisathyasaivachanamrutam

బలము ఏమీ పని చేయదు. అదే రీతిగా దైవబలముముందు ఏ ఇతర బలములు పని చేయవు. అట్టి దైవబలమును మనం పెంచుకోవాలి.

**భుజబలంబు గొప్ప బుద్ధి బలంబుండియు**
**దైవబలము లేక దీనుడగును**
**కర్ణుడంతటివాడు కడపటికేమయ్యె?!**

కర్ణునికి ఉన్నంత బలము మరొకనికి లేదు. భుజబలము, బుద్ధి బలము మొదలుగా గల సర్వబలములుంటున్నాయి, అతనికి. కాని, దైవబలము కలిసి రాలేదు అతనికి.

**దైవబలంబులేక దాసుండు తానయ్యె**

దైవబలములేక దాసుడుగా మారిపోయాడు. కనుక సర్వబలములకంటె దైవబలమే గొప్పది. అదే సరైన బలము. ఆ బలములేక ఎన్ని బలములుండినా అంతా దుర్బలమే! రావణాసురునకు ఎన్నో బలములుంటున్నాయి. పది తలలుంటున్నాయి. ఇరవై చేతులుంటున్నాయి. ఇంకా ఎన్నెన్నో శక్తులంతా ఉన్నాయి. అన్ని ఉండి కట్టకడపటికి ఏమయ్యాడు? అతడు దైవబలము పెంచుకోలేదు. లౌకికబలాన్ని పెంచుకుంటూ వచ్చాడు. కనుకనే కట్టకడపటికి తాను దహనమైపోయాడు. దుర్యోధన, దుశ్శాసనులకు ఎంత బలముంటున్నాది! కానీ దైవబలాన్ని పెంచుకోలేదు. పాండవులు ఐదుమందే ఉన్నారు. కాని, ఐకమత్యంగా ఉన్నారు. కనుక, అదే గొప్పబలంగా వచ్చింది.

**దైవభావము పెంచుకుంటే సర్వము ఏకమైపోతుంది**

వందలమంది ఉన్నప్పటికి ఐకమత్యంగా లేకపోతే దుర్బలమే అవుతుంది. ఐదువేళ్లున్నాయి. ఒక్కొక్క వేలు ప్రత్యేకంగా ఉంటున్నాది. అయితే ఆ ఐదువేళ్లు ఏకమైనప్పుడు ఎంతపనైనా సాధించవచ్చు. పంచపాండవులు ఏకంగా ఉండటంచేత విజయాన్ని సాధిస్తూ వచ్చారు. వాలిసుగ్రీవులలో ఐకమత్యంలేదు. ఇద్దరే అన్నదమ్ములు. ఒకరికొకరు విరోధులు కావటంచేత పూర్తిగా నాశనమైపోయారు. ఐకమత్యాన్ని పెంచుకోవాలి. అందరూ దైవముయొక్క బిడ్డలే! దైవబిడ్డలలో ఒకరిపైనొకరికి ద్వేషముండకూడదు. మీకందరికి తెలుసు,

sri sathyasai vachanamrutam

నిత్యజీవితములో ఎన్ని కుటుంబాలో ఐకమత్యంగా ఉంటుండి అభివృద్ధి పొందారు. ఆ ఐకమత్యము ఎప్పుడు చెడిపోయిందో అప్పుడు సంసారము పూర్తిగా నాశనమైపోయింది. కుటుంబమంతా ఛిన్నాభిన్నమైపోయింది. మొట్టమొదట స్వతంత్రాన్ని సాధించాలని కుటుంబములో వ్యక్తులు విఱ్ఱవీగుతున్నారు. స్వతంత్రముకాదు, ప్రధానము, ఐకమత్యము కావాలి. ఐకమత్యమును మనం సాధించుకోవాలి. ఈ ఐకమత్యానికి దైవము ఒక్కడే మూలకారణము. దైవభావాన్ని పెట్టుకున్నప్పుడే సర్వులు ఏకమైపోతారు. చూడండి, ఈ హాలులో ఎన్ని దేశముల వారున్నారు, ఎన్ని భావముల వారున్నారు, ఎన్ని విధములైన తలంపులు కలిగిన వారున్నారు? కానీ అందరు ఒక్క స్వామిభావంచేత ఏకమైపోయారు. దైవభావము ఒక్కదానిని పెంచుకుంటే సర్వమూ ఏకమైపోతుంది. ఆ దైవభావము లేకపోవడంచేత ఎవరికివారు వేరు వేరై పోతున్నారు.

**ప్రేమతత్త్వమును అభివృద్ధి పరచుకున్నప్పుడే పర్వదినముల అర్థము గుర్తించటానికి వీలవుతుంది**

ప్రేమస్వరూపులారా! మీరందరూ దైవస్వరూపులే, మీరందరూ ప్రేమస్వరూపులే, మీరందరూ శాంతస్వరూపులే! మానవాకారము ధరించిన దైవస్వరూపులే మీరందరు. కనుకనే 'దైవం మానుష రూపేణ'. ఆ భావాన్ని మీరు పెంచుకోండి. దైవప్రేమలో మీ జీవితాన్ని ముంచిపెట్టండి. ఈ ప్రేమ మరొకదానికి మీరు ఉపయోగపెట్టకండి. మీలో ఆవిర్భవించిన ప్రేమంతా భగవంతునికి అర్పితము చేయండి. ప్రేమతత్త్వాన్ని అభివృద్ధి పరచుకున్నప్పుడే ఈ పవిత్ర పర్వదినముల అర్థము గుర్తించటానికి వీలవుతుంది. ధనముపై ఆశవుంది. ఇండ్లపై ఆశవుంది. భార్యాబిడ్డలపై ఆశ వుంటున్నాది. ఉండవలసిందే, ఉండకూడదని చెప్పటంలేదు. కానీ అంత మాత్రమున దైవముపై ప్రేమ వుండనక్కరలేదా? మీ తండ్రిని ఎవరైనా ద్వేషిస్తే నీకు ఎంత కోపం వస్తుంది? నీ తమ్ముని ఎవరైనా నిందించినారంటె నీకు ఎంత కష్టమవుతుంది? అట్లానే నీ ఆరాధ్య దైవాన్ని నిందించినప్పుడు నీవు ఎట్లా ఓర్చుకొని ఉండగలవు? నీవు రాక్షసుడవా, మనిషివా? నీవు ఎందుకు ఎదుర్కొనడంలేదు? ఇది నా దైవము, నా భావము అనే రీతిగా మీరు పెట్టుకోవాలి. ఈనాడు

srisathyasaivachanamrutam

మీ ప్రేమనంతటిని భగవంతునికి మాత్రమే అర్పితము చేయాలి. అందరియందు ఉండిన భగవంతుని ఏకత్వంగా భావించాలి. అందరియందుండిన భగవంతుడే ఏకాత్మభావము. ఆ unity ఉండినప్పుడే ఎంతైనా Divinityని సాధించవచ్చు. ఈనాడు అట్టి ఐకమత్యము లేకుండావుంది. 'స్వార్థము, స్వార్థము'. తన స్వార్థము తాను చూచుకుంటున్నాడే గానీ పరుల విషయం ఆలోచించటంలేదు. 'నేను నావారు; నేను నావారు'. What about society? సమాజమును గురించి యోచించినప్పుడే నీవు, నీవారు క్షేమంగా ఉండగలరు. సొసైటిని విస్మరించి 'నేను, నావారు' అనుకుంటే, నీవు ఎక్కడున్నావు? సొసైటిలో కాదా? సొసైటీ లేక క్షణమైన జీవించటానికి వీలుకాదు. కనుక, సమాజముయొక్క సేవ మనం ప్రారంభించాలి. సమాజ క్షేమంలోనే మన క్షేమం ఇమిడి ఉంటున్నాది. ఇట్టి ప్రేమ మనము అభివృద్ధి పరచుకోవాలి. ఈనాడు మనం చేయవలసింది, I+you+he+he ప్లస్, ప్లస్ చేసుకుంటూ పో! అందరూ ఏక కుటుంబముగా ఉంటారు. అట్లుకాక మైనస్, మైనస్ అనుకుంటే చివరికి ఉండేది నీవు ఒక్కడే! కాబట్టి ప్లస్ చేసుకుంటూ పోవాలి. అందరు ఒక్కటే! వసుధైక కుటుంబము. అందరము భగవంతుని బిడ్డలమే! తండ్రి ఒక్కడే, బిడ్డలు అనేకంగా ఉంటున్నారు. Brotherhood of man and fatherhood of God. ఈ ప్రేమను మనం పెంచుకోవాలి. భగవంతుని చింతన విడచి ఒక్క క్షణమైనా నిల్చటానికి వీలులేని భావాన్ని మనం పెంచుకోవాలి.

**(తేదీ 01-01-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahamrutam